క్లుప్తంగా

అభివృద్ధి పనులకు భూమిపూజ



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డీఎల్‌డీఓ శ్రీనివాసులు

గోపవరం : ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టబోయే అభివృద్ధి పనులకు డివిజనల్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు బుధవారం భూమిపూజ నిర్వహించారు. పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా గోపవరం పంచాయతీ శ్రీనివాసపురంలో రూ.6 లక్షలతో సీసీ దారి, గోకులాల నిర్మాణాలకు ఎంపీడీఓ ఎం.రామనాథ రెడ్డితో కలిసి ఆయన భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరంలో మంజూరైన 22 పనులను వెంటనే ప్రారంభించి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈటీఆర్‌డీ హసీన, ఏపీఓ విజయమ్మ, ఏఈ శ్రీనివాసులు, విజయకుమార్, శ్రీనివాసులురెడ్డి, మోశ, నిఖిత, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుపై గ్రామసభ



పంట నమోదు జాబితాను ప్రదర్శిస్తున్న వ్యవసాయాధికారులు

గోపవరం : మండలంలోని కాలువపల్లె రైతు సేవా కేంద్రం పరిధిలో ఈ క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీ అనంతరం అధికారులు బుధవారం గ్రామసభ నిర్వహించారు. పంట సాగు చేసినా.. ఇంకా ఈ-పంట నమోదు చేయించుకోనివారుంటే రైతు సేవా కేంద్రంలో వీఏఏలను సంప్రదించాలన్నారు. ఏవైనా సందేహాలుంటే రైతులు నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ గ్రామ సభలో విజయకుమార్, ఓబయ్య, వీఏఏ.సుబ్బయ్య, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



కమ్మవారిపల్లె కాలనీలో నిర్మించిన నూతన ఆలయం

పోరుమామిళ్ల : మండలంలోని కమ్మవారిపల్లె కాలనీలో నిర్మించిన నూతన ఆలయంలో సీతా,లక్ష్మణ, హనుమత్సమేత పట్టాభిరాముడు, వరసిద్ధి వినాయక విగ్రహాల ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేద పండితులు ధ్వజస్తంభ, శిఖర కలశ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా జరిపారు. గత నాలుగు రోజులుగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ప్రతిష్ఠ అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

రెయిన్ కోట్లు పంపిణీ



రెయిన్ కోటును అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర

మైదుకూరు : వర్షాకాలంలో ఉపయుక్తంగా ఉండేందుకు మైదుకూరు మున్సిపాలిటీలో బుధవారం పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్లను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర కార్మికులకు రెయిన్‌కోట్లను అందజేశారు. వర్షాలకు రెయిన్ కోట్లు ఉపయోగపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పెంచలప్ప తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బి.కోడూరు : బద్వేల్‌లోని నిరాశ్రయుల వసతి గృహం, షాలోమ్ అనాథ శరణాలయంలోని వృద్ధులు, పిల్లలకు వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం అన్నదానం చేసి దుస్తులు పంపిణీ చేశారు. అంగనగొడుగునూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కత్తెరపల్లె వెంకటసుబ్బారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన సోదరుడు కత్తెరపల్లె నారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి తదితరులు బుధవారం ఈ కార్యక్రమం చేపట్టారు. వెంకటసుబ్బయ్య, నాయకులు లక్ష్మీరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల ఉర్దూ సెమినార్‌కు ఎంపిక

కడప ఎడ్యుకేషన్ : నంద్యాల మజ్లిసుల్ వల్ ఆయామా(ఇమాముల సంఘం) ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన జరిగే సీమ స్థాయి ఉర్దూ సెమినార్‌కు కడప ఉర్దూ సాహితీవేత్తలు సత్తార్ ఫైజి, మగ్బూల్‌అహ్మద్‌లకు ఆహ్వానం అందింది. ప్రముఖ ఉర్దూ సాహితీవేత్త సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ జయంతి సందర్భంగా నంద్యాల అంజుమన్ షాదీ ఖజానాలో జరిగే ఈ సెమినార్‌లో పరిశోధన పత్రాలు సమర్పించాలని నిర్వాహకులు ఆహ్వానం పంపారు.

అవగాహన లేకుంటే అనర్థమే

- రక్షణ లేకుండా మందులు పిచికారీ చేస్తే ప్రమాదం
- మోతాదు మించితే పంటకు నష్టం
- అప్రమత్తత అవసరమంటున్న వ్యవసాయాధికారులు



వరి పంటలో మందు స్ప్రే చేస్తున్న రైతు

రాజుపాళెం : వ్యవసాయంలో పురుగు మందుల వినియోగం బాగా పెరిగిపోయింది. విత్తనాలు చల్లడం మొదలు పురుగు మందుల పిచికారీ వరకు కొంతమంది రైతులకు సరైన అవగాహన లేదని చెప్పవచ్చు. దీంతో కొందరు రైతులు పంటలపై ఎక్కువ మోతాదులో పురుగు మందులు, రసాయన ఎరువులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఫలితంగా పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఖరీఫ్, రబీ సీజన్‌లలో సాగు చేసిన పత్తి, మినుము, పసుపు, వరి, పెసర, మిరప, మొక్కజొన్న పంటలపై పురుగు ఉధృతి ఎక్కువగా ఉంది. నాలుగు రోజులకోసారి ఖరీదైన పురుగు మందులను రైతులు పిచికారీ చేస్తున్నారు. అంతేకాకుండా విత్తనం వేసిన 24 గంటల్లో.. మొలిచిన 16 నుంచి 30 రోజుల్లో కలుపు మొక్కల నివారణకు పురుగు మందుల పిచికారీ చేస్తున్నారు. ప్రస్తుత కాలంలో పురుగు నివారణ మందుల వినియోగం పెరగడంతో లాభం కంటే నష్టం ఎక్కువగా ఉంది. మందు అధికంగా వినియోగించడంతో భూమిలో భూసారం తగ్గడంతో పాటు మేలు చేసే జీవాలు చనిపోతున్నారు. తలకు హెల్మెట్, ముఖానికి మాస్కు, చేతులకు గ్లౌజులు ధరించి మందులను పిచికారీ చేయాలి. 25 డిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద స్ప్రే చేయడం పంటలకు తడి అందించిన అనంతరం ఉదయం వేళల్లోనే పురుగు మందులు పిచికారీ చేయాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చేతులకు గ్లౌజులు, ముక్కు, నోటికి అడ్డంగా మాస్క్ తప్పనిసరిగా పెట్టుకోవాలి.
- పురుగు మందు పిచికారీ చేస్తున్న సమయంలో సిగరెట్లు, బీడీలు వంటివి కాల్చరాదు.
- చేతులు శుభ్రం చేసుకోకుండా కళ్లు, నోరు, ముక్కు, ముఖాన్ని రుద్దరాదు.
- మందు పిచికారీ తరువాత దుస్తులు శుభ్రంగా ఉతుక్కోవాలి.
- రసాయన ప్రభావానికి లోనైతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.
- పురుగు మందుల డబ్బాలు, సీసాలు కాలువల్లో, చెరువుల్లో వేయరాదు. అలాంటి నీరు తాగరాదు.
- ఎదురు గాలికి మందును పిచికారీ చేయరాదు.
- స్ప్రేయర్ల నాణ్యత బాగుండాలి. ఎటువంటి లీకేజీ ఉండరాదు.
- పిచికారీ సమయంలో నాజిల్ సమస్య వస్తే నోటితో ఊదడం మంచిది కాదు.
- ద్రావణం కలిపే మందు డబ్బాపై ఉన్న లేబుల్ సూచనల ప్రకారం మందులు కలుపుకోవాలి.
- భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.

జాగ్రత్తలు తప్పనిసరి



రైతులు క్రిమి సంహారక మందులు పిచికారీ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. చేతులకు గ్లౌజులు, ముఖానికి మాస్కులు లేకుండా మందులు స్ప్రే చేయరాదు. పంటలపై సరైన మోతాదులో మాత్రమే క్రిమి సంహారక మందులను వినియోగించాలి. లేకుంటే పంట దెబ్బతినే అవకాశం ఉంది.
– శివరామ కృష్ణారెడ్డి, వ్యవసాయాధికారి, రాజుపాళెం మండలం

వైద్యులను సంప్రదించాలి



పురుగు మందులు పిచికారీ సమయంలో అస్వస్థతకు గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలి. పురుగు మందు డబ్బాలను తీసుకువస్తే అస్వస్థతకు గురైన వ్యక్తికి వైద్యం అందించడం సులువు అవుతుంది. పిచికారీ చేసే వ్యక్తి శరీరం మొత్తం కప్పి ఉంచేలా వస్త్రాలు ధరించాలి. భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.
– మంజుల, పీహెచ్‌సీ వైద్యురాలు, రాజుపాళెం మండలం

అధికంగా మందులు పిచికారీ చేయొద్దు



పంటల్లో పురుగు మందులను పిచికారీలో రైతన్నలు, కూలీలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. మోతాదుకు తగ్గట్టుగానే పురుగు మందులను పిచికారీ చేయాలి. అధికంగా పిచికారీ చేయడం వల్ల నష్టమే తప్ప ఆదాయం ఉండదు. ప్రతి రైతు తక్కువ దిగుబడితో అధికంగా ఆదాయం పొందాలి.
– ఉమ్మడి సహదేవ రెడ్డి, బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక


ఎస్.దేవానందం


కె.సుధాకర్


రెడ్డిపోగు నరసింహులు


చిట్టెం కంచిరెడ్డి


కె.గురుమోహన్

బద్వేలు అర్బన్ : బద్వేల్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో జరిగిన మండల మహా సభలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.విజయకుమార్, డి.గురుప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎస్.దేవానందం (చిన్నబాబు), ప్రధాన కార్యదర్శిగా కె.సుధాకర్, కోశాధికారిగా ఎ.గురయ్య, గౌరవాధ్యక్షుడిగా ఎస్.సుబ్బరాజ, సహాధ్యక్షులుగా ఎం.నరేష్, శివభారతి, కార్యదర్శులుగా శ్రీనివాసులురెడ్డి, గురయ్య, రాజా, శ్రీధర్‌రెడ్డి, విజయ భాస్కర్, సాహిత్య, సుధారాణి, పెంచలయ్య, శ్రీకాంత్‌లు ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా పవన్‌కుమార్, సభ్యులుగా గౌస్‌బాష, మురళీకృష్ణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.ఓబుళరెడ్డి వ్యవహరించారు.

అట్లూరు : మండల ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ శాఖ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఓబుళరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గురు ప్రసాద్ పేర్కొన్నారు. గౌరవాధ్యక్షుడిగా ఇ.కొండయ్య, అధ్యక్షుడిగా రెడ్డిపోగు నరసింహులు, సహాధ్యక్షులుగా ఎస్.వీరయ్య, జి.నిర్మల, ప్రధాన కార్యదర్శిగా చిట్టెం కంచిరెడ్డి, కోశాధికారిగా కె.గురుమోహన్, కార్యదర్శులుగా ఎన్.శ్రీరామ్, నాగసుబ్బయ్య, వరలక్ష్మి, ఈశ్వరరెడ్డిలను ఏకగ్రీంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

భారత్ వైన్స్ షాపును తొలగించాలి



సెంట్రీ సాలమ్మకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన భారత్ వైన్స్ షాపును తొలగించాలని విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులు ములపాకు ప్రతాప్‌రెడ్డి, పుల్లయ్య, ఓబులేసు, దాసులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పాత బస్టాండ్ వద్ద ప్రభుత్వ మద్యం షాపు ఉంటే ఆందోళన చేసి తొలగించామన్నారు. మహిళలు, విద్యార్థినులు ఎక్కువగా పాత బస్టాండ్‌కు వస్తుంటారని అక్కడ మద్యం షాపు ఏర్పాటు చేయడం తగదన్నారు. ఇప్పుడు తిరిగి ప్రైవేటు వ్యక్తులు మళ్లీ అదే ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయడం దౌర్భాగ్యమన్నారు. వెంటనే ఆ మద్యం షాపును రద్దు చేయాలని ఎక్సైజ్ శాఖ సీఐ, ఎస్ఐ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో సెంట్రీ సాలమ్మకు వినతిపత్రం అందించామని తెలిపారు. అలాగే భగత్ సింగ్ కాలనీలో ఏర్పాటు చేసిన గోసుల బార్ అండ్ రెస్టారెంట్ తొలగించాలని కలెక్టర్, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



పెన్నానది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ జాన్ ఎరివిన్ పులపర్తి

కమలాపురం : ప్రస్తుతం వర్షాలు అధికంగా కురుస్తున్నాయని అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని కడప ఆర్డీఓ జాన్ ఎరివిన్ పులపర్తి తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. పట్టణంలో సకాలంలో రేషన్ పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలనుంచి అందిన సమస్యలు అలాగే రైతులకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. బెంగలూరు, విజయవాడ 6 లైన్ల రహదారి, కమలాపురం బైపాస్‌కు సంబంధించి భూ సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని ఎటువంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం గంగవరం వద్ద పెన్నా నదిలో ప్రవాహాన్ని పరిశీలించారు. తహసీల్దార్ శివరామిరెడ్డి, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



మైదుకూరు రోడ్డులో సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నందున మున్సిపల్, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని మున్సిపల్ కమిషనర్ వివి.నరసింహారెడ్డి అన్నారు. వర్షాల నేపథ్యంలో మైదుకూరు రహదారులపై నిలిచిన వర్షపు నీటిని తొలగించే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని చాలా ప్రాంతాల్లో డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, తక్షణమే అక్రమ నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరారు. గుడిసెలు, పాత భవనాలు, మట్టి మిద్దెలలో ఉన్నవారిని అప్రమత్తం చేసి సురక్షిత ప్రదేశాలకు చేర్చాలని ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలల్లో తాత్కాలిక పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. సమస్యలుంటే కంట్రోల్ రూమ్ నెంబర్ 6301956870ను సంప్రదించాలని కోరారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దు



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర

కడప కార్పొరేషన్ : వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర సిబ్బందిని ఆదేశించారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా అశోక్ నగర్, అప్సర సర్కిల్, వై-జంక్షన్, గురుకుల్ విద్యాపీఠం, వినాయకనగర్ సర్కిల్ ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జట్టింగ్ మిషన్ సాయంతో కడప కోర్టు నుంచి ఆర్టీసీ సర్కిల్ వరకూ ఉన్న నీటిని తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈలు ధనలక్ష్మి, నారాయణస్వామి, డీఈ వేణుగోపాల్, ఏఈలు పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయం

కడప కార్పొరేషన్ : మహమ్మద్ ప్రవక్త సూచించిన మార్గం అనుసరణీయమని మేయర్ కె.సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పేర్కొన్నారు. స్థానిక రాజాఖాన్ బాగ్ మసీదు వద్ద వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేత మున్నా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్యార్మీ కార్యక్రమంలో వారు పాల్గొని ఫాతేహా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదానం పుణ్యకార్యమని, మహ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

ఉరుసు ఉత్సవాలకు ఆహ్వానం

కడప కల్చరల్ : ప్రముఖ పర్యాటక సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రం కడప అమీన్‌పీర్ దర్గా ఉరుసు ఉత్సవాలకు హాజరుకావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేన్ సాహెబ్ ఆహ్వానించారు.

వధూవరులకు ఆశీర్వాదం



వివాహ వేడుకలో వరుడితో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

మైదుకూరు : పట్టణంలోని మదీనా నగర్‌లో బుధవారం జరిగిన ఓ వివాహ వేడుకలో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి పాల్గొన్నారు. జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ షేక్ మదీనా దస్తగిరి అన్న కుమారుడు షేక్ అలీ సుల్తాన్ వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి వరుడికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో ఎమ్మెల్సీతోపాటు రాష్ట్ర వ్యాసాయ శాఖ మాజీ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, బద్వేలు మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరాములు, మైదుకూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, ఉమర్, వెంకటసుబ్బయ్య, సాయి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్డు



ప్రొద్దుటూరు : స్థానిక రామేశ్వరం నుంచి వాటర్ ట్యాంక్‌లకు పోయే రోడ్డు చాలా అధ్వానంగా ఉంది. ఈ దారిలో మున్సిపల్ హైస్కూల్, ప్రైవేటు హైస్కూల్ ఉన్నాయి. తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వచ్చినప్పుడల్లా గుంతల్లో నీళ్లు నిలబడటంతో వాహనదారులు, పాదచారులు వెళ్ల లేకపోతున్నారని పేర్కొన్నారు. ఈ దారి వెంబడి వెళ్లే వారు పలు మార్లు కిందపడి గాయాల పాలయ్యారన్నారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

19న గండిలో టెండర్లు

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో ఈనెల 19న ఈ టెండరు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఏడాది పాటు ఆలయ ప్రాంగణంలో కొబ్బరి కాయలు విక్రయించుకునేందుకు ఈ టెండర్ నిర్వహిస్తున్నామన్నారు. అలాగే షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న 9 గదులను లీజుకు ఇచ్చేందుకు కూడా వేలం పాట నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే వస్త్రాలు, స్టేషనరీ, ఎలక్ట్రికల్ సామాన్లు, ప్రింటింగ్, ఎంపీ పార్ట్స్ సరఫరా చేయుటకు, ఖాళీ నెయ్యి డబ్బాలు, ఖాళీ ప్లాస్టిక్ సంచులు, నిరుపయోగ వస్తువులు ఎల్‌ఈడీ కలర్ టీవీ విక్రయించుటకు టెండర్లు నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి డిపాజిట్లు చెల్లించుటకు తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం

కొండాపురం : మండల పరిధి తాడిపత్రి-కడప జాతీయ రహదారిలోని కె.సుగుమంచిపల్లె పెట్రోల్ బంక్ సమీపంలో ఓ గదిలో అక్రమ మద్యం విక్రయిస్తున్న సురేష్‌ను కడప ఎక్సైజ్ శాఖ స్క్వాడ్ టీం అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ విన్నిలత బుధవారం తెలిపారు. అతని వద్ద నుంచి 24 అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

విద్యా సంస్థలకు దూరంగా మద్యం షాపులు పెట్టాలి

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : కడప కార్పొరేషన్ పరిధి చింతకొమ్మదిన్నె మండలం నుంచి విలీనమైన 15, 16వ డివిజన్లలో నూతనంగా ఏర్పాటుచేసిన మద్యం దుకాణాలను విద్యాసంస్థలు, ప్రార్థన మందిరాలకు దూరంగా తరలించాలని ఆర్‌సీపీ మండల కార్యదర్శి మడగలం ప్రసాద్ కోరారు. కలెక్టర్, ఎస్పీ, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, కడప, కమలాపురం ఎమ్మెల్యేలకు కూడా విన్నవించామన్నారు.

ఎడతెరిపిలేని వర్షం.. రోడ్లన్నీ జలమయం



ప్రొద్దుటూరు శ్రీరాములపేట వీధిలో నిలిచిన వర్షం నీరు



ప్రొద్దుటూరు గోకుల్ నగర్ వీధిలో నిలిచిన వర్షం నీరు



మురికి కాలువలో పూడిక తీత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్



ప్రొద్దుటూరు పొలాల్లో నిలిచిన వర్షం నీరు



అట్లూరు : పిట్టిగుంటలో నేలకొరిగిన చింతచెట్టు

ప్రొద్దుటూరు : ఎడతెరిపిలేని వర్షం కారణంగా పట్టణ ప్రాంత ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడుతోంది. సాయంత్రం వరకు 36.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

రోడ్లన్నీ జలమయం...

తీవ్ర వర్ష ప్రభావం కారణంగా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రోడ్లపై వర్షం నీరు నిలబడటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గాంధీ రోడ్డు, మైదుకూరు రోడ్డు, కొర్రపాడు రోడ్లల్లో వర్షం నీటి ప్రభావంతో డ్రైనేజీ కాలువలు పొంగిపొర్లాయి. మైదుకూరు రోడ్డుతోపాటు మోడంపల్లె బైపాస్ రోడ్డుపై అడుగడుగున గుంతలు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బొంగు బజార్ వద్ద రోడ్డుపై గోతులు పడటంతో లారీ–కారు ఢీ కొనడంతో చాలా చేసే ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కొర్రపాడు రోడ్డులో మోకాలు లోతు వర్షం నీరు నిలిచి ఉంది. గాంధీ రోడ్డులోని పెట్రోలు బంకు వద్ద, శ్రీరాములపేటలో రోడ్ల పరిస్థితి ఇలాగే కనిపించింది. కొర్రపాడు రోడ్డులోని గోకుల్ నగర్ ఎంట్రన్స్ వద్ద ఏడాది పొడవునా వర్షం నీరు నిలిచి ఉంటుంది. వర్షాలు పడినప్పుడు ఆ ప్రాంత వాసులు వీధిలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పండింది. గోకుల్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోనే ఉన్నా రోడ్లు లేని కారణంగా ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోయారు.

మురికి కాలువల్లో పూడికతీత పనులు

మున్సిపాలిటీలో వర్షం కారణంగా మురికి కాలువల్లో అడ్డు పడిన చెత్తా చెదారాన్ని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సిబ్బందితో తొలగించారు. ఉదయం పట్టణంలోని ప్రధాన రోడ్లను కమిషనర్ పరిశీలించి వర్షం నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. రాజీవ్ సర్కిల్ వద్ద ఉన్న మదూరు ఛానల్‌లో మురికి నీరు నిలబడకుండా పూడికను సిబ్బందితో తీయించారు. ఆంధ్రకేసరి రోడ్డు, టూటౌన్ పోలీస్‌స్టేషన్, మైదుకూరు రోడ్డులోని మురికి కాలువలను ఆయన పరిశీలించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. వర్ష ప్రభావం ఎక్కువ కావడంతో నియోజకవర్గ పరిధిలోని పంట పొలాల్లో వర్షం నీరు నిలబడి ఉంది. వరి, మినుము పొలాల్లో నీరు నిలిచింది. మినుము పంట ఎక్కువగా దెబ్బతింది.

60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

కాశినాయన : తుపాను కారణంగా 24 గంటల్లో మండలంలో 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పిట్టిగుంటలో చింత చెట్టు విరిగిపడి విద్యుత్తు తీగలు తెగిపడ్డాయి. అధికారులు విద్యుత్తు పునరుద్ధరించారు.